# గాలివాన



'జాగృతి' (1963) దీపావళి కథల పోటీలో ద్వితీయ బహుమతి పొందిన కథ

పండుగ సంబరం మమ్మురంగా సాగుతోంది!

ఆ గ్రామంలో ఎక్కడ చూసినా వేడుకలూ, వినోదాలూ విశేషంగా జరుగుతున్నాయి. అత్తవారిళ్ళకు వచ్చిన కొత్త అల్లుళ్ళు గ్రామంలో విచ్చలవిడిగా తిరుగుతున్నారు. ఆ ఏడు భూమాత తనను నమ్ముకొన్నవారిని ఎప్పటికంటే ఎక్కువగా తృప్తిపరిచింది. ప్రతి రైతు చేతిలోనూ డబ్బు బాగా ఆడుతోంది.

ఆ యేటి సంరంభం అంతగా ఉండడానికి అదొక్కటే కారణం కాదు. వచ్చే యేడు దేశవ్యాప్తంగా ఎన్నికలు జరుగబోతున్నాయి. ఏదున్నా, ఏది లేకపోయినా రాజకీయ చైతన్యానికి మాత్రం ఆ గ్రామంలో లోటు లేదు. అధునాతన ఆంధ్ర గ్రామానికి మచ్చు తునక ఆ గ్రామం. ఆ గ్రామానికల్లా వెంకటరెడ్డి, వీరయ్య చౌదరి మోతుబరి రైతులు. చెరొక పార్టీని పట్టుకున్నారు.

భోగి పండుగ నాడు వెంకటరెడ్డి బీదవాడలకు స్వయంగా వెళ్లి, ఇంటింటికీ క్రొత్తబట్టలూ, తినుబండారాలూ పంచిపెట్టి వచ్చాడు. ఆ పేద ప్రజానీకం వెంకటరెడ్డిని 'ధర్మదాత' అని పొగిడింది.

ఈ వార్త తెలిసి మర్నాడు చౌదరి ఆ వాడలకు స్వయంగా వెళ్లి, రెడ్డి పెట్టిన వాటికంటే ఖరీదైన బట్టలూ, ఐదురూపాయలూ, బియ్యం, పప్పు, ఉప్పులూ, కూరలూ సహా పంచిపెట్టి వచ్చాడు. ఈ పంపకం పోటీలోని ఆంతర్యం అర్థంకాక బుఱ్ఱ గోక్కుంది జనం. రాజనీతిజ్ఞులకు మాత్రం ఇందులో విశేషమేమీ కనిపించలేదు. వచ్చే ఎన్నికలలో వారిద్దరూ నిలబడుతున్నట్లూ, అందుకు ఆ గూడెం ఓట్లు కొనడానికి ఇది నాందీ ప్రస్థావన అనీ ఊహించడానికి వారికి క్షణంసేపు పట్టలేదు.

మర్నాడు కనుము పండుగ!

జనం కడుపారా కల్లు త్రాగి గ్రామం అంతా విచ్చలవిడిగా తిరుగుతున్నారు. వేపచెట్టు క్రింది గట్టమీదా, రామాలయం మండపంలోనూ, గంగానమ్మ గుడి చావట్లోనూ, గుంపులు గుంపులుగా చేరి పేకాటలూ, జూదం ఆడుతున్నారు జనం. వారి ఈలలతోనూ, కేకలతోనూ రణగొణ ధ్వనిగా వుంది.

ఊరి చివర తాటితోపులో పొట్టేళ్ళ పందెం ఏర్పాటైంది.

రెడ్డి, చౌదరీ తెగబలిసిన పోతులను పెంచుతున్నారు. కేవలం పందెం కోసమే పెంచుతున్నారు ఆ పోతులను– మనిషికన్నా ఎక్కువ శ్రద్ధతో! వాటిని చూస్తుంటేనే ఝుడుపు పుట్టేటట్లు ఉంటుంది. ఊరి నాయకుల పోతుల మధ్య పందెం అవడంతో– ఆ సాయంత్రం

నాలుగు గంటలకల్లా ప్రక్క గ్రామాల నుంచి కూడా జనం విపరీతంగా వచ్చారు. టైమవుతోందనగా గ్రామంలోని జనం అందరూ పేక, జూదం అన్నీ ఆపేసి పరుగుపరుగున ఆ స్థలం చేరుకున్నారు. పోతులను బరిలోకి పంపించే ముందు పందాలు వేలమీదికి వెళ్లాయి.

రెడ్డి, చౌదరీ బరి ఇవతల కుర్చీల మీద కూర్చున్నారు. వత్తాసు మనుషులు హుషారు ఇయ్యడానికి ప్రక్కనే కూర్చున్నారు.

పందెం మొదలైంది!

పొట్టేళ్ళు హోరాహోరీ పోట్లాడుతున్నాయి. రెండూ ముందుకాళ్లు నేలకేసి కొడుతూ, పరుగున వచ్చి తలలు ఢీకొట్టుకొంటుంటే– "ధిబ్బా... ధిబ్బా..." అని చప్పుడవుతూ, రెండు కొండలు ఢీకొన్నట్లుగా ఉంది. ఒక్కొక్క దెబ్బకి వాటి పుర్రెలు పగిలి నెత్తురు కారుతుంటే– వాటి పౌరుషం పెరిగి మరీ ఉధృతంగా పోట్లాడుకుంటున్నాయి. హుషారుతో జనం వేసే కేకలతో వాటి రౌద్రం మరీ పెరుగుతోంది.

ఒక అరగంట వరకూ రెండూ ఉధృతంగానే పోట్లాడాయి. రెండూ సమ ఉజ్జీలుగా ఉండి ఏది జయిస్తుందో చెప్పలేని స్థితిలో పోరాడాయి. చౌదరిపోతు పరుగు పరుగున వచ్చి, "ఢీ..." మని కొట్టింది రెడ్డిపోతుని. అసలే పగిలిన పుర్రె! దానిమీద అంత దెబ్బ తగలడంతో క్రిందకు పడిపోయింది రెడ్డిపోతు. జనం ఒక్కసారి "హేయ్ః..." అని కేక వేశారు.

రెడ్డి నోట్లో చుట్ట తీసి అవతల పారేసి అధాటుగా లేచి నుంచున్నాడు.

చౌదరి "శభాష్..." అని ప్రక్కవాడి వీపు చరిచి లేచాడు.

ఈలోగా క్రిందపడ్డ రెడ్డిపోతు లేచి నిలబడింది. జనం మళ్లీ సర్దుకుని కూర్చున్నారు.

రెడ్డిపోతుకి పౌరుషం పెరిగింది. పరుగున వచ్చి ఢీకొనబోయింది చౌదరిపోతును. ఆకస్మికంగా వచ్చిన ఈ దాడిని తప్పించుకోడానికి చౌదరిపోతు ప్రక్కకు తిరిగింది. దాంతో... రెడ్డిపోతు కొమ్ములు చౌదరిపోతు డొక్కలో దిగిపోయాయి. "మాః..." అంటూ అది భీకరారవంతో నేలకు ఒరిగింది.

గొల్లుమంటూ జనం లేచి నుంచున్నారు. లోన కొమ్ములను విడిపించుకోవటం కోసం చేసే ప్రయత్నంలో రెడ్డిపోతు చౌదరిపోతును బరిలోకి ఈడ్చివేసింది. ఆ ఉదుటుకి దాని కొమ్ములు బయటకు వచ్చి దానితో పొట్టలోని ప్రేగులను కూడా బయటకు లాగుకుని వచ్చాయి. ఆర్తనాదంతో చౌదరిపోతు ప్రాణాలు విడిచింది.

ఆ భీకర వాతావరణంలో జయం రెడ్డికి లభించింది. రెడ్డి ముఠా ఉత్సాహంతో ఈలలు వేసి చప్పట్లు చరిచింది. గుట్టుచప్పుడు కాకుండా జారుకుంది చౌదరి ముఠా.

గెలిచిన రెడ్డిపోతుకు తగిన ఉపచారాలు చేసి, రిక్షాలో కూర్చోబెట్టి, దానిమెళ్లో దండలు వేసి, బ్యాండుమేళంతో, ముందు గ్యాస్‌లైట్లతో ఊరేగింపు లేవదీశారు రెడ్డి ముఠా.

గ్రామం అంతా నానా కోలాహలంగా ఉంది. ఇదంతా ఏమిటో అర్థంకాక, రిక్షాలో నిలబడి చూస్తోంది రెడ్డిపోతు. దానిమీద చేయి వేసి, విజయగర్వంతో మీసం మెలేస్తూ, దానిప్రక్కనే నిలబడ్డాడు వెంకటరెడ్డి. ఊరేగింపు చౌదరి వీధిలోకి వచ్చేసరికి– జనసమ్మర్థం బాగా ఎక్కువైంది.

చౌదరి ఇల్లు సమీపించింది.-

ఆవేశంలో ఒళ్ళు తెలియని జనం... "వెంకటరెడ్డి గారికి జెయ్!", "చౌదరికీ జూ!", "చౌదరి నశించాలి!", "చౌదరికి ముక్కెలు విరుగకొట్టాం!" వంటి నినాదాలతో రెచ్చిపోయారు. వాళ్ళు కఱ్ఱలతో తయారుగానే ఉన్నారు. ఆవేశాలు పెరిగి రెండు పార్టీలు కఱ్ఱలతో కలబడ్డాయి. ఆ గోలలో ఎవరు ఎవరిని కొడుతున్నారో తెలియడం లేదు.

ఈ దొమ్మీ సంగతి ప్రక్కనేవున్న బస్తీ పోలీస్‌స్టేషన్‌కి టెలిఫోను ద్వారా తెలియజేయబడింది. ఆ చుట్టుప్రక్కల గ్రామాల్లో ఇటువంటి పార్టీదొమ్మీలు చాలా సామాన్యం అవడం వల్ల– ఆ బస్తీలో పోలీసు సిబ్బంది ఎప్పుడూ సిద్ధంగానే ఉంటుంది.

కబురు అందగానే పోలీసుదళం వాయువేగ మనోవేగాలతో అక్కడికి వచ్చింది. సామంగా దొమ్మీ ఆగకపోయేసరికి రెండురౌండ్లు కాల్పులు జరపవలసి వచ్చింది.

అప్పటికి ఎలాగయితేనేం– దొమ్మీ ఆగింది. కాని, రెండు నిండుప్రాణాలను బలిగొని, ఆరుగురికి గాయాలను కల్పించి, ఆ దొమ్మీ శాంతించింది తాత్కాలికంగా. పోలీసులు స్టేటుమెంట్లు తీసుకొని, క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి, ఊళ్లో పోలీసు కాపలా ఉంచి వెళ్లిపోయారు. ఒక వారం వరకు అక్కడ 144 వ సెక్షను అమలు జరపాలని ఉత్తర్వులు వేశారు.

ఆ క్షతగాత్రులలో ఆ ఊరి బడిపంతులు విశ్వనాథశాస్త్రిగారు కూడా ఒకరు.

ఆయన ఆ ఊరి శివాలయంలో పూజారి కూడా! ఆయన వేదవేదాంగాలూ, సర్వశాస్త్రాలూ, పురాణాలూ, ఇతిహాసాలూ అన్నీ చక్కగా చదువుకున్నాడు. తగుమాత్రం ఆధునిక ఆంగ్లవిద్యలో కూడా ప్రవేశం ఉన్నవాడు, సాత్వికుడు, దైవభక్తి పరాయణుడు. ఆ గ్రామ ప్రజలందరినీ ఎంతో ఆదరంతో చూస్తూ... ఎవరికి ఏ సహాయం కావలసివచ్చినా

చేస్తుండేవాడు. దానము లన్నిటా విద్యాదానాన్ని మించింది లేదని నమ్మినవాడవడం వల్ల గుళ్ళో అర్చన అయిపోగానే ఇంటికి వచ్చి, అరుగు మీద కూర్చుని ఊరి పిల్లలకు పాఠాలు చెబుతుండేవాడు.

ప్రతి తండ్రి కూడా ఆయన హస్తవాసి మంచిదనీ, మొదట తమ బిడ్డను అక్కడే చేర్పించేవారు. చౌదరీ, రెడ్డిల పిల్లలు కూడా అక్కడే చదువుకుంటున్నారు. ఊళ్లో ఎన్ని తుచ్ఛ రాజకీయాలు ఉన్నా- అవి ఆయన సమీపానికి కూడా రాలేకపోయేవి. ఆయన యధాశక్తి ఆ కలుషిత వాతావరణాన్ని శుభ్రం చేయడానికే ప్రయత్నించేవాడు.

ఆయన మధ్యవర్తిత్వమే లేకపోతే ఆ గ్రామంలో ప్రతిరోజూ ఖూనీలు జరుగుతుండేవి. రెడ్డికి కాని, చౌదరికి కాని ఆయనను తమ ముఠాలో చేర్పించుకుని, ఆయన పలుకుబడిని తమ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవాలని ఉండేది. కానీ, అయన నైజం తెలిసినవారికి ఆ ధైర్యం ఉండేది కాదు. గౌరవంగా బ్రతుకుతూ, ఏ ముఠాకూ చెందక అందరి అభిమానాన్నీ చూరగొన్న వ్యక్తి ఆ గ్రామంలో ఆయన ఒక్కడే.

కనుము నాటి రాత్రి దొమ్మీని నివారించడానికి ఆయన ఎంతో శ్రమపడ్డాడు. ఆవేశంలో ఉన్న ఆ ప్రజలకు ఆయన విజ్ఞప్తి అరణ్యరోదన అయింది. చివరకి చౌదరికి తగులబోతున్న కఱ్ఱదెబ్బను ఆపే ప్రయత్నంలో ఆయన బుఱ్ఱ పగిలింది. ఆసుపత్రిలో చేర్చారు ఆయనను.

ఆ మర్నాడు ఆ గ్రామప్రజలు- దొమ్మీ జరిగినందుకంటే కూడా శాస్త్రిగారికి గాయం తగిలినందుకు చాలా బాధపడ్డారు. వారంతా ఆసుపత్రికి వెళ్లి చూసిరావడం మొదలుపెట్టారు ఆయనను. వారి అభిమానానికి కృతజ్ఞతతో ఆనందించాడు ఆయన.

చౌదరీ, రెడ్డి కూడా శాస్త్రిగారికి అయిన గాయానికి చాలా విచారించారు. అందుకు కారణం తామేనని అంతరాత్మ ఘోషిస్తుంటే సిగ్గుపడి తలలు వంచుకున్నారు.

శాస్త్రిగారిని చూసి తమ విచారాన్ని వెలిబుచ్చడానికి ఆసుపత్రికి వెళ్లారు. అప్రయత్నంగా ఇద్దరూ చెరి ఒక గుమ్మంలోంచి ఒకేసారి శాస్త్రిగారి బెడ్ వద్దకు చేరారు.

ఒకరినొకరు చూసుకొని నిర్ఘాంతపోయారు. వారిద్దరినీ చూసి, అంతకుముందే లోపల ఉన్నవాళ్ళు బయటకు వచ్చేశారు- ఒకరి ముఖం ఒకరు చూసుకుంటూ.

వారిద్దరినీ ఒక్కసారి కలసి చూడడంతో శాస్త్రిగారికి సంతోషం కలిగింది.

ఆయన ఆప్యాయంగా- "రండి.. రండి... ఇద్దరూ ఇలా చెరోవైపూ కూర్చోండి!" అని ఆహ్వానించాడు.

ఆ ఇద్దరూ అయిష్టమైనా ఆయన మాట కాదనలేక అలా కూర్చున్నారు.

ఇద్దరూ శాస్త్రిగారి ముఖంలోకి చూడలేక అపరాధుల వలె తలవంచుకొని ఉండిపోయారు. చివరికి చౌదరే ప్రయత్నం మీద-

"పంతులు గారూ... నన్ను క్షమించాలి. జరిగినదానికి చాలా విచారిస్తున్నాను. అందులోనూ నన్ను కాపాడనున్న మీకు గాయమవడం నాకు చాలా బాధ కలిగిస్తోంది!" అన్నాడు బాధపడుతూ.

శాస్త్రిగారు "దానికేంలే నాయనా... ఇందులో నీ తప్పు ఏముంది? మనం అంతా నిమిత్తమాత్రులం... ఎలా జరగవలసివుంటే అలా జరుగుతుంది!" అన్నాడు.

రెడ్డి "ఇల్లా జరుగుందని అనుకోలేదు బాబుగారూ!" అన్నాడు ఇంకేమీ అనలేక.

శాస్త్రిగారు "జరిగినందుకు కాదు నాయనా- మనం బాధపడవలసింది! ఇకముందు అటువంటివి జరగకుండా చూసుకోవాలి!" అన్నారు.

చౌదరి "అసలు అంతా ఈ వెంకటరెడ్డి మూలంగా జరిగింది పంతులుగారూ!" అన్నాడు రెడ్డిని క్రీగంట చూస్తూ.

రెడ్డి "ఆ కూతే కూయొద్దు!" అన్నాడు గట్టిగా.

చౌదరి "ఏమన్నావ్?" అంటూ లేచాడు.

శాస్త్రిగారు "ఆగండి నాయనలారా... ఆగండి!" అంటూ లేవబోయి, గాయం నెప్పి పెట్టగా "అబ్బా..." అంటూ మళ్లీ పడుకున్నారు.

ఇద్దరూ మళ్లీ మెదలకుండా కూర్చున్నారు.

శాస్త్రిగారు ఒక క్షణం ఆగి, "ఇందులో ఎవ్వరి తప్పూ లేదు నాయనా! అసలు తప్పు మనలో పేరుకొనివున్న అనాగరికతది. కాకపోతే నిష్కారణంగా ఆ పోతులకు పోటీ పెట్టడం ఎందుకు? అవి తలలు పగిలి నెత్తురు కారి బాధపడుతూ, ప్రాణాలు తీసుకుంటుంటే... అది చూసి ఆనందించడం ఏమి న్యాయం నాయనా! తామసమైన ఆ పశుప్రవృత్తే ఈ అనర్థానికి మూలకారణం! ఇతరుల బాధను స్వంతబాధగా అర్థంచేసుకో గలిగినప్పుడు ఈ అనర్థాలు జరుగవు నాయనా!" అన్నారు బాధతో.

ఇద్దరూ కొద్దిక్షణాలు ఏమీ మాట్లాడలేదు.

చివరికి చౌదరే- "ఈ వేదాంతం మాకు అర్థం అవదు పంతులుగారూ!" అన్నాడు బుర్రగోక్కుంటూ.

"ఈ సంబరం ఇవాళిటిదా బాబూ... ఏనాటినుంచో వస్తోంది!" అన్నాడు రెడ్డి.

"ఈ బాధ ఈవేళ మనకు అర్థమవదు... మన ప్రాణాలు ఇతరుల గుప్పెట్లో ఉన్నప్పుడు ప్రాణం విలువ తెలుస్తుంది. ఆ ఏకాంబరేశ్వరస్వామి మీకు సమయం వచ్చినప్పుడు తెలియజేస్తాడు" కొంచెం నిష్ఠూరంగానే అన్నాడు.

రెడ్డి "బాబుగారూ... ఇంక వెళ్లివస్తాను... మళ్లీ కలుస్తాను!" అంటూ లేచాడు.

శాస్త్రిగారు "ఆగు నాయనా! ఆ స్వామి దయవల్ల మీ ఇద్దరూ అనుకోకుండా ఇక్కడ కలిశారు. నా కళ్ళ ఎదుట ఒకసారి మీ చేతులు కలుపుకోండి నాయనా... అంతకంటే నాకు సంతోషమైనదింకేం ఉంటుంది?" అన్నారు.

చౌదరి చివాలున లేచి, "పంతులుగారూ... ఆ మాట మాత్రం అనకండి! మీరు ఏంచెప్పినా చేస్తాను కానీ, ఈ పని మాత్రం చేయలేను!" అన్నాడు.

శాస్త్రిగారు మందహాసం చేసి, "మీ ఇష్టంలేని పని చేయమని నేను ఎప్పుడూ అనను. ఆ భగవానుడు తలుచుకున్నప్పుడు మీరే కలుస్తారు, వెళ్లిరండి నాయనా!" అని అన్నాడు.

వాళ్ళిద్దరూ మౌనంగా బయటకు నడిచారు.

●

ఒక్క నాలుగు నెలలు గడిచాయి!

శాస్త్రిగారు పూర్తి ఆరోగ్యం పొందారు.

గ్రామంలో చెప్పుకోదగ్గ సంఘటనలేమీ జరుగలేదు. అందరూ ఎవరి పనులు వాళ్ళు శాంతంగా చేసుకుపోతున్నారు.

ఆ శాంత వాతావరణం భరించలేనట్లు జనరల్ ఎన్నికలు ముందుకురాసాగాయి. అవి ఇంకొక్క ఎనిమిది నెలలే ఉన్నాయి. ఒక పక్షం తరపున 'వెంకటరెడ్డి', రెండవ పక్షం తరపున 'వీరయ్య చౌదరి' నిలబడడానికి నిశ్చయించుకున్నారు.

అసెంబ్లీకి పార్టీల తరపున ప్రచారం మొదలుపెట్టమని ప్రాంతీయపార్టీ కార్యాలయాల నుండి ఆదేశాలు వచ్చాయి. రెండు పార్టీల తరపున ఛోటానాయకులు వచ్చి ఆ గ్రామంలోనూ, చుట్టుప్రక్కలా మీటింగులు పెట్టి, ఉపన్యాసాలు దంచడం మొదలుపెట్టారు.

రోజులు గడుస్తున్నకొద్దీ ఉపన్యాసాల జోరు హెచ్చవసాగింది.

గోడలన్నీ వాల్‌పోస్టర్లతోనూ, పెయింటింగ్‌లతోనూ నిండిపోసాగాయి. ఉపన్యాసంలో పార్టీ ప్రచారం అంతకంతకూ తగ్గి, ఎదురు దూషణలలోకి దిగసాగింది.

కరపత్రాలలో ఒకరిపైనొకరు తిట్టుకుంటూ, చివరికి అంతరంగిక విషయాలను కూడా బట్టబయలు చేసుకొనే స్థితికి దిగజారారు వారు.

వెంకటరెడ్డి పెద్దకొడుకు సుబ్బారెడ్డి. 'లోకంలో ఉన్న దుర్వ్యసనాలన్నీ ముద్దచేసి దానికి రూపకల్పన చేసి, పేరు పెడితే అది సుబ్బారెడ్డి అవుతుంది' అనవచ్చు. త్రాగుడు, జూదం, వ్యభిచారం మొదలైన వాటన్నిటిలోనూ పరిపూర్ణత సిద్ధించుకున్నాడు. రోజూ పగలనక, రాత్రనక ఊరిచివర పాడుబడ్డ మఠంలో పడి జూదం ఆడుతుంటాడు. ఆ ముఠాలో నిత్యమూ పోట్లాటలు జరుగుతుండేవి.

ఆ రాత్రి జూదంలో పేచీ వచ్చి ముఠాల కొట్లాట జరిగింది. దానికితోడు వారిలో వారికి వ్యభిచారపు తగాదాలు లక్ష ఉన్నాయి. ఇవన్నీ చినికి చినికి గాలివాన అయి, ఆరోజు జరిగిన కొట్లాటలో సుబ్బారెడ్డి మృతికి కారణమయ్యాయి.

ఎప్పుడైతే సుబ్బారెడ్డి చచ్చిపోయాడో ముఠా అంతా ఎవరి మట్టుకు వాళ్ళు చల్లగా జారుకున్నారు.

తెల్లవారేసరికి గ్రామమంతా సుబ్బారెడ్డి హత్య సంగతి పాక్కిపోయింది.

పోలీసులు వచ్చి శవాన్ని స్వాధీనం చేసుకొని, ఆసుపత్రికి శవపరీక్ష కోసం పంపించారు.

వెంకటరెడ్డికి తన కొడుకు జూదంముఠా దెబ్బలాటలో మరణించాడని తెలిసింది. ఎదిగిన పెద్దకొడుకు పోవడం తనకు దెబ్బ అయినా, అతనివల్ల రోజూ వచ్చే జట్టీలు పోయినందుకు అతనికి కొంచెం ఊరట కలిగింది. పరిస్థితులను సానుకూల పరచుకోగల ప్రజ్ఞగల వెంకటరెడ్డి బుఱ్ఱకి ఈ హత్యోదంతాన్ని ప్రచారసాధనంగా ఉపయోగించవచ్చని తట్టింది. 'రాజకీయ కక్షల మూలంగా ఈ హత్య చౌదరే చేయించాడు' అని పుకారు వదిలాడు. గట్టిగా ఆరా తీస్తే అసలు రహస్యం బయటపడుతుందని, పోలీసులకు లంచం పెట్టి కేసు నిరూపితం కాలేదని కొట్టివేయించాడు. చౌదరే తన కొడుకును హత్య చేయించాడని బాహాటంగా తిట్టడం, ఉపన్యాసాలలో ప్రచారం చేయడం, కరపత్రాలు వేయించడం మొదలుపెట్టాడు.

ఈ అపవాదు వినేసరికి చౌదరికి గంగవెర్రులెత్తింది. కాని, తను రెడ్డిని కాని, అతని మనుషులను కాని ఏమి చేసినా అది తన అపవాదును బలపరుస్తుందని భయపడి ఏమీ చేయలేక ఊరుకున్నాడు. రెడ్డి ప్రచారం చూస్తుంటే మాత్రం అతని హృదయం ఉడికిపోతోంది, అతని పచ్చినెత్తురు త్రాగాలని ఆరాటపడుతోంది. అక్కడికీ సుబ్బారెడ్డి

హత్యతో తనకేమీ సంబంధం లేదనీ, అది జూదగాళ్ళు చేసిన పననీ, వెంకటరెడ్డి తనపై తన నియోజకవర్గ ప్రజలకు అపోహ కల్పించే నిమిత్తం ఇలా ప్రచారం చేస్తున్నాడనీ కరపత్రాలు వేశాడు, మీటింగులలో చెప్పాడు.

కానీ, ఉత్తేజం కన్పించే విషయానికి అధిక ప్రాధాన్యం ఇయ్యడం మానవ లక్షణం. అందుచేత వెంకటరెడ్డి అభియోగానికి కలిగిన ప్రచారం- చౌదరి వాదానికి కలుగలేదు.

చేసేదేంలేక సమయం చూసి రెడ్డిపై కసి తీర్చుకోవాలని నిశ్చయించుకున్నాడు చౌదరి.

●

రోజులు త్వరత్వరగా గడిచిపోతున్నాయి.

పార్టీల ప్రచారం, అభ్యర్థుల ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. గ్రామంలో ఉద్రిక్తత నానాటికీ హెచ్చవుతోంది. బడానాయకులు కూడా వచ్చి ఆ నియోజక వర్గంలో ఉపన్యాసాలు ఇవ్వడం మొదలుపెట్టారు. ఉద్రిక్తత తీవ్రతరమవుతున్నకొద్దీ చౌదరి, రెడ్డిల మధ్య కక్షలు పెరగసాగాయి. గడ్డివాములు తగులపెట్టడం, కోట్లాడుకోవడం మొదలైనవి వారానికి ఒకసారైనా జరుగుతున్నాయి.

విశ్వనాథశాస్త్రిగారు ఈ పరిస్థితిని మెరుగుపర్చేందుకు కృషి చేస్తూనేవున్నారు. కానీ, ఆయన ఘోషణ చెవిటికి శంఖం ఊదినట్లవుతోంది.

రెడ్డి, చౌదరిల మధ్య పగ రోజురోజుకీ ప్రబలుతోంది. చివరికి ఒకరినొకరు మట్టుపెట్టుకోవడానికి కూడా సిద్ధంగా ఉన్నారు.

ఎన్నికలు దగ్గరవుతున్నకొద్దీ చౌదరి బుఱ్ఱ వేగంగా పనిచేయడం మొదలుపెట్టింది.

'తాను చేయని నేరానికి తనపై హత్యానేరం మోపి తన పరువును భ్రష్టం చేశాడు రెడ్డి. అతను ఖచ్చితంగా వాళ్ళ పార్టీ టిక్కెట్లపై నెగ్గగలడని భావిస్తున్నాడు. ఈ సమయంలో కనుక ఏ విధంగానైనా రెడ్డి అభ్యర్థిత్వాన్ని వాళ్ళ ప్రాంతం పార్టీ ప్రాంతీయ సంఘం తిరస్కరించేటట్లు చేయగలిగితే అటు రెడ్డి అపహాస్యం పాలవుతాడు, తన కసీ తీరుతుంది. డబ్బు క్రుమ్మరించాలే కాని- అది చేయలేని పనేమి ఉంది? అధిష్టానవర్గ సమావేశం ఇంక పదిహేను రోజులే ఉంది. వారంరోజుల్లో రెడ్డి హైదరాబాదుకి వెళ్లి అక్కడే తిష్టవేసుకొని కూర్చుంటాడు. ఈలోగా తాను ఎవ్వరికీ తెలియకుండా హైదరాబాద్ వెళ్లి చేయవలసిన పని చేయాలి...' అని నిశ్చయించుకున్నాడు చౌదరి.

'ఇప్పుడెక్కడికి పోతావు రెడ్డీ..!' అనుకుని గుప్పిలి బిగించాడు.

మర్నాడు ఎక్కడికి వెళ్తోందీ... ఆఖరికి భార్యకైనా చెప్పకుండా హైదరాబాద్ ప్రయాణమయ్యాడు చౌదరి. తాను లక్షాధికారి. తలచుకుంటే తాను చేయలేని పని ఏముంది? అప్పటికే నగరానికి కొద్దికొద్దిగా వర్ధమాన అభ్యర్థులు వస్తున్నారు... తమ అభ్యర్థిత్వాన్ని ఆమోదింపజేసుకోవడం కోసం! వడ్డించేవాడు మనవాడయితే కడపంక్తిని కూర్చోమన్నారు.

వాళ్ళ పార్టీ అధ్యక్షుడు సాటికులంవాడు- నేర్పుగా ఆయనను ఆశ్రయించాడు చౌదరి. ముందు కొంచెం బెట్టు చేసినా, చివరకి గలగల శబ్దం వినిపించేసరికి పాచికలో పడ్డాడు. చౌదరి ఆయనతో సహా అవసరమనుకున్న ఇతురుల ప్రీత్యర్థం ఒక 'ల'కారము తనది కాదనుకున్నాడు. అప్పు వ్యవహారం లేక, కేవలము రొఖ్ఖపు వ్యవహారాన్నే నడిపి వెంకటరెడ్డి వ్రేళ్లూడగొట్టడానికి మాట తీసుకువచ్చాడు.

వెంటనే ఒక 'నస్మరంతి' చేత ఒక పోటీ దరఖాస్తు పంపింపచేశాడు. వ్యవహారం మాత్రం అతిగోప్యంగా జరిగింది. వెంకటరెడ్డి తనకు పోటీ దరఖాస్తు మరొకటి వచ్చిందని తెలుసుకుని ముందు కొంచెం ఆశ్చర్యపడ్డా- ఆ తర్వాత ఊరూ, పేరు లేని ఆ అభ్యర్థి దరఖాస్తు గ్రుడ్డి కంటివతు అని భావించుకొని ఊరుకున్నాడు. మరో నాలుగు రోజులలోనే హైదరాబాద్ చేరుకుని, అధిష్టాన వర్గానికి ఉపగ్రహమై మిగిలిన అట్టి ఉపగ్రహాలతో పాటు పరిభ్రమించడం మొదలుపెట్టాడు.

రావలసిన రోజు రానేవచ్చింది...

అనుకున్నంత పనీ అయింది!

వెంకటరెడ్డి అభ్యర్థిత్వాన్ని అధిష్టాన వర్గం అంగీకరించలేదు. ఆ పోటీ ధరఖాస్తుని అంగీకరించింది. రెడ్డి తన చెవులను తానే నమ్మలేకపోయాడు. ఆ ఎన్నిక చేసిన పేర్లు వింటుంటే అతని కాళ్లక్రింద భూమి గిరగిరా తిరిగిపోతున్నట్లనిపించింది. ఆవేశంలో పళ్ళు పటాపటా కొరికాడు. చేతులతో జుట్టు పీక్కున్నాడు.

తనను తోసిపుచ్చిన కారణం తెలుసుకొనడానికి అధ్యక్షుని వద్దకు వెళ్లాడు. కానీ, అతను నీళ్లు నములుతూ తప్పించుకు తిరిగాడు. సూక్ష్మంగా విచారిస్తే ఇది చౌదరి చేసిన పని అని తెలిసింది. పట్టరాని కోపంతో చౌదరి అంతు చూడాలని గ్రామానికి బయలుదేరాడు. ఈ ఎన్నిక చేసిన వార్తగానే గ్రామంలో తగిన బందోబస్తు ఏర్పాటుచేశారు పోలీసులు.

విషణ్ణవదనంతో ఇంటికి తిరిగి వచ్చాడు వెంకటరెడ్డి.

బయటకు రావడానికి అతనికి ముఖం చెల్లలేదు. అన్నం, నిద్రమాని 'చౌదరిపై పగ తీర్చుకోవడమెలాగా..?' అని ఆలోచిస్తున్నాడు.

'చౌదరి రక్తం కళ్ళజూడందే తన మనస్సుకు తృప్తి లేదు. తన ప్రాణం పోయినా సరే- చౌదరిని చంపి తీరాలి. తన పరువే పోయాక వెధవ ప్రాణం ఉంటే ఎంత? పోతే ఎంత? చౌదరిని చంపడానికి ఎవరినైనా వినియోగిస్తే అది జరగకపోవచ్చు. పైగా చౌదరి తప్పించుకొనిపోవచ్చు. మొత్తం నాశనం అవుతుంది. అందుచేత ఏమైనా చౌదరిని తనే స్వయంగా చంపాలి. అప్పుడు కాని తన పగ చల్లారదు.'

విచారిస్తే చౌదరి నాగమాపురం వెళ్లినట్లు తెలిసింది. మర్నాటికి కాని రాడుట! 'ఆ గ్రామం ఎంతో దూరంలేదు. ఒక్క పదిమైళ్లు కాలువ గట్టమ్మట, తోపుల్లోనూ నడిస్తే చేరుకోవచ్చు. ఇదే మంచి అవకాశం! ఈరాత్రే నాగమాపురం గుట్టుచప్పుడు కాకుండా వెళ్లి, చౌదరిని మట్టుపెట్టాలి' అని నిశ్చయించాడు రెడ్డి.

సందెవేళే భోజనం చేసి, తలపాగా అదీ బాగా చుట్టి, ఎవరూ గుర్తుపట్టకుండా వేషం మార్చి, నాగమాపురం బయలుదేరాడు రెడ్డి.

సందె చీకటి పడింది. ఆకాశంలో మేఘాలు పల్చగా ఉన్నాయి. 'వర్షం వస్తే రావచ్చు. మహా వస్తే సన్న తుప్పర మించి రాదులే!' అనుకున్నాడు రెడ్డి.

ఒక్క ఆరు మైళ్లు నడిచేసరికి పల్చగా ఉన్న మబ్బులు దట్టంగా అలుముకున్నాయి. బ్రహ్మాండమైన గాలీ, మెరుపులూ, ఉరుములతో ఆకాశం అల్లకల్లోలం అవడం మొదలుపెట్టింది. వాన కూడా ప్రారంభమై అంతకంతకూ ఎక్కువ కాజొచ్చింది. రెడ్డికి ఏమిచేయడానికీ పాలుపోలేదు. ఎటూ దారి కనిపించడం లేదు. చేతికఱ్ఱ ఆధారంగా నడుస్తున్నాడు. గాలికి ఏ చెట్టు విరిగి మీదపడుతుందో తెలియదు. తన నిర్ణయం పూర్తికాందే తను మృతిచెందుతానేమోనని భయం వేసింది.

"భగవంతుడా! నన్ను చంపదలుచుకుంటే చంపు. కానీ, చౌదరిని నా చేతులతో చంపాక నన్ను చంపు!" అని మనస్సులోనే ప్రార్థించాడు.

ఆకాశంలో ఈ చివరనుండి ఆ చివరకు ఒక పెద్దమెరుపు మెరిసింది. ఆ ప్రకాశానికి అంతా పట్టపగలైపోయింది. కూక అల్లంత దూరంలోనే ఏకాంబరేశ్వరస్వామి దేవాలయం శిథిలమై కనిపిస్తోంది. తలదాచుకునేందుకు స్థావరం చూపించినందుకు భగవంతునికి మనస్సులోనే కృతజ్ఞత తెలుపుకుని త్వరత్వరగా అడుగులు వేస్తూ, ఆ వానలో తడుస్తూ, ఆ గుడిలో ప్రవేశించాడు.

ఆ గుడి ఏనాటిదో..?! ఒకనాడు మహా వైభవం అనుభవించినట్లు చెబుతుంది దాని పరిమాణం! శిథిలమైనా శిల్పసౌందర్యం మాత్రం పోలేదు. మధ్యమధ్య పడిపోయింది కప్పు. రెడ్డి ఆ గుడిలో తడవకుండా తలదాచుకోగలిగాడు. కానీ, ఈదురుగాలి రివ్వున వస్తుంటే తడిబట్టల మీద చలికి గజగజా వణకసాగాడు. అలాగే యాతన ననుభవిస్తూ నిలబడ్డాడు గోడను కరుచుకొని.

రెడ్డి పళ్ళు చలికి టకటకా కొట్టుకుంటున్నాయి. పట్టు బలవంతం మీద అవి కొట్టుకోకుండా ఆపాడు. కానీ, విచిత్రం! ఇంకా అవి కొట్టుకుంటూన్న శబ్దం వినవస్తోంది. తాను భ్రమపడడం లేదు కదా! చేతిలో పళ్ళు తడిమిచూసుకున్నాడు. అవి కదలడం లేదు! మరి, ఈ శబ్దం ఏమిటి?

'దయ్యం కాదుగదా?'

ఆ ఆలోచన రాగానే అతని గుండె ఝల్లుమంది.

అప్రయత్నంగా అంజనేయ దండకం మనస్సులో చదువుకున్నాడు. కానీ, ఆ శబ్దం వినిపిస్తూనే ఉంది. పరకాయించి కళ్ళు పెద్దవి చేసి చుట్టూ కలియజూశాడు. కానీ, ఎక్కడా ఏమీ కన్పించలేదు. అంతా చిమ్మ చీకటి! ఆ శబ్దం ఎక్కడనుంచో దగ్గర నుంచే వస్తున్నట్లు పసిగట్టాడు. శ్రద్ధగా వింటే ఎవరో ఉచ్ఛ్వాసనిశ్వాసాలు కూడా చేస్తున్నట్లు వినిపించింది. 'ఈ చీకటిలో తనకి తోడైన ఆ ప్రాణి ఎవరా... ఎక్కడా..?' అని అనుకోసాగాడు రెడ్డి.

ఇంతలో... తళుక్కున ఒక్క మెరుపు మెరిసింది. ఆ ప్రకాశంలో తన వరుసలోనే అవతలి స్తంభానికి ఆనుకొని, ఒంటినిండా ముసుగులో ఉన్న వ్యక్తి ఎవరో కనిపించాడు.

రెడ్డి ప్రాణం లేచివచ్చింది. ఆ కాళరాత్రిలో తనకు మనిషి తోడు లభించినందుకు అతడు భగవంతునికి మనస్సులోనే ప్రణమిల్లాడు.

"ఎవరది..?" అంటూ అటువైపు వెళ్లాడు రెడ్డి. ఆ చీకట్లో తడుముకుంటూ ఒక చేయి ఆ స్తంభం మీద, రెండో చేయి ఆ వ్యక్తి భుజం మీద వేశాడు.

సమాధానంగా ఆ వ్యక్తి పొడిదగ్గు దగ్గాడు.

"ఎవరది?" అని రెట్టించి అడిగాడు రెడ్డి.

"నీలాగే ఈ గాలివానలో తలదాచుకోవడానికి వచ్చిన బాటసారిని!"

రెడ్డి తేలికగా నవ్వాడు. "ఎవరైతే ఏమిటీ..! ఈ గాలీ, వానా ఎప్పుడు తగ్గుతాయో ఏమో! కాలక్షేపానికి మనిషి అంటూ దొరికావు... అంతే చాలు!" అన్నాడు.

ఆ స్వరం "హాఁ... ఏ క్షణానికి ఎవరిని, ఎవరు, ఎక్కడ, ఎలా కలుసుకోవాలో! ఈ ప్రపంచం కూడా ఇంతే కాబోలు? బాటసారుల వలె కలిసి విడిపోతుంటాం!" అంది.

రెడ్డి "ఏమిటో వేదాంతం పలుకుతున్నావే!" అన్నాడు మర్యాదగా..

ఆ స్వరం "కాకపోతే మరేమిటి? రేపు బయలుదేరి వెళ్లవలసిన వాడిని- పనయిపోయిందని వద్దన్నా వినకుండా ఇవాళే బయలుదేరాను, ఇక్కడ ఇరుక్కున్నాను!" అంది.

రెడ్డి "అంతేలే... ఖర్మ కాకపోతే ఏమిటి- ఇవాళ నాకీ విఘ్నం!?" అన్నాడు బరువుగా నిట్టూరుస్తూ.

బయట గాలివాన, ఉరుములు, మెరుపులు ఎక్కువైనాయి. సమయం మించిపోతోందని రెడ్డికి ఆతృత ఎక్కువైంది. అతడి ప్రయత్నం వ్యర్థమవుతుందేమోనని ఆందోళన కల్గింది, కసి పుట్టింది.

"ఎలా తప్పించుకోగలవో చూస్తాను చౌదరీ..!" అంటూ గుప్పిలి బిగించి అప్రయత్నంగా గొణిగాడు.

ఒక్క క్షణం నిశ్శబ్దం తర్వాత అవతల నుండి వికటాట్టహాసం వచ్చింది. ఆకాశంలో పెద్ద మెరుపు మెరిసింది. ఆ వెలుతురులో ఒకరిముఖాలు ఒకరు స్పష్టంగా చూసుకున్నారు.

"ఆఁ..." అంటూ వెనక్కి అంగ వేశాడు.

"రెడ్డీ... నువ్వు అదృష్టవంతుడివి! నన్ను చంపాలని బయల్దేరావు కదూ?! నా చేతికి చిక్కి చావబోతున్నావు. నాపై నీ కొడుకు హత్యానేరం మోపి నన్ను నిందలపాలు చేశావు. నా పరువు, ప్రతిష్ఠ నాశనం చేసి నన్ను నవ్వులపాలు చేశావు. అందుకే ప్రతీకారం తీర్చుకోవాలని వేచివుంటే ఆ అవకాశం నీకై నీవే కల్పించావు. ఇది పవిత్రమైన దేవాలయం... ఆఖరిసారి దైవాన్ని ప్రార్థించుకో!" అంటూ కైజారు తీశాడు చౌదరి.

రెడ్డి నిశ్చేష్టుడైపోయాడు. ఏమి మాట్లాడడానికి నోరు రాలేదు. తాను హత్య చేయడానికి బయల్దేరినా ఈ అనుకోని సంఘటన అతణ్ణి హతబుద్ధిని చేసింది. అనిర్వచనీయమైన భయంతో గట్టిగా కళ్ళు మూసుకున్నాడు. గజగజా వణికిపోయాడు. తనకు అవసానకాలం మూడిందనే ఊహ కూడా అతడికి కలగలేదు.

కైజారు ఎత్తి రెడ్డి గుండెలలో పొడవబోతున్న చౌదరి దద్దరిల్లిపోయాడు.

ఆకాశాన్ని బ్రద్దలు చేసుకుంటూ ఫెళఫెళా శబ్దం చేస్తూ వారి ఎదురుగా ఉన్న గోడ కూలుతోంది.

చౌదరి అప్రయత్నంగా ఒక్క ఉదుటున రెడ్డిని వాటేసుకుని, ఇవతలకు లాగి పారవేశాడు. ఫెళఫెళలాడుతూ కప్పు కూలిపోయింది. ఇద్దరికీ గండం తప్పింది.

వారిద్దరూ తెప్పరిల్లేసరికి కొన్ని నిముషాలు పట్టింది. విసురుకు క్రిందపడిన రెడ్డి కొంచెం ఆయాసపడుతూ లేచాడు. పక్కనే నిశ్చేష్టుడై నిలబడివున్నాడు చౌదరి.

రెండు క్షణాలు ఎవరూ మాట్లాడలేదు. వారి పరిస్థితి వారికే అర్థంకాలేదు.

స్తిమితపడ్డ రెడ్డే అన్నాడు– "నన్నెందుకు ఇవతలికి లాగావు చౌదరీ? నన్ను వదిలి నువ్వు తప్పించుకుంటే నీ పనిని భగవంతుడే చేసేవాడుగా! నీ కసీ తీరేది!" అన్నాడు అదొక రకం వేదాంతంలో చౌదరి.

"నిజమే! నాతోపాటు నిన్ను ఎందుకు రక్షించానో నాకూ ఆశ్చర్యంగానే ఉంది. రక్షించిన నా చేత్తో నిన్నింక చంపదల్చలేదు..." అంటుండగా కళ్ళు మిరుమిట్లు కొల్పుతూ భయంకరమైన మెరుపు మెరిసింది.

"చౌదరీ..." అని గావుకేక పెట్టి చౌదరిని ఇవతలకు గుంజాడు రెడ్డి.

"పా... ప్పాము..." అన్నాడు రెడ్డి వణికిపోతూ.

చౌదరి అటు చూశాడు. తను నుంచున్నచోట తన తలపై భయంకరంగా వ్రేలాడుతున్న త్రాచు కనిపించింది.

"కాస్తలో కాటు వేసేదే..." పూర్తి చేశాడు రెడ్డి.

కంపించిపోతున్నారిద్దరూ. వెంటనే గుడి వసారాలోకి పరుగెత్తారు. క్షణం నిశ్శబ్దంగా గడిచింది. వానా తగ్గుతోంది. ఈసారి నిశ్శబ్దాన్ని చౌదరి ఛేదించాడు.

"మరి, నన్ను ఇవతలికి లాగావెందుకు– నీ కసి తీరే అవకాశాన్ని వదిలి?"

రెడ్డికి కూడా వెంటనే జవాబు తోచలేదు.

'నిజమే... తానెందుకు ఇవతలికి లాగినట్లు?' ఏదో విచిత్రానుభూతిగా ఉంది.

"నువ్వు నన్నెందువల్ల రక్షించావో అందువల్లనే!" అన్నాడు జవాబుగా.

వారి ప్రవర్తనకు వారికే నవ్వు వచ్చింది..

"ఏమిటి రెడ్డీ... ఈ విచిత్రం?" చౌదరి అన్నాడు. ఆ స్వరంలో ఆ ప్రశ్నలో ద్వేషం లేదు, కసి లేదు– ఏదో స్నేహభావం ధ్వనించింది. ఏదో జిజ్ఞాస ధ్వనించింది.

క్రమంగా వర్షం ఆగిపోయింది... వెన్నెల వస్తోంది.

"చౌదరీ... మనమెందుకు పోట్లాడుకుంటున్నట్లు?" తన అంతరాత్మనే అడిగినట్లు అడిగాడు రెడ్డి.

"స్నేహంగా బ్రతకడం చేతకాక!" చౌదరి హాస్యం మేళవించి అన్నాడు.

ఇంతలో... గుడిగంటలు మ్రోగాయి. ఇద్దరూ ఆశ్చర్యంగా అటు చూశారు. విశ్వనాథశాస్త్రిగారు బయటకు వస్తున్నారు. వాకిట్లో వీరిద్దరినీ చూసి ఆయనా ఆశ్చర్యపడ్డారు.

"మీరా స్వామీ... ఈ వేళప్పుడు మీరిక్కడెందుకున్నారు?" ఇద్దరూ ఒక్కసారిగా అడిగారు.

గుడిగంట ఠంగున మ్రోగేసరికి ఇద్దరూ అటు చూశారు. వెన్నెల బాగా వచ్చింది. ఆ వెన్నెల్లో వారివంక విశ్వనాథశాస్త్రిగారు చిరునవ్వుతో చూస్తున్నారు.

ఆయన "నేడు కార్తీక పౌర్ణమి... మహా పర్వదినం! ఈ పర్వదినాన ఈ ఏకాంబరేశ్వరస్వామి ఎందరికో ముక్తి నిచ్చాడు. ఈ స్వామిని అర్చించడానికి సాయంత్రం ఇక్కడకు వచ్చి, గాలివానలో బిగిసిపోయాను. స్వామి దగ్గరనే ఉండి ధ్యానం చేసుకుంటున్నాను. వర్షం వెలిసింది గదా అని బయటికి వస్తున్నాను. ఇంతకీ... మీరిక్కడెందుకున్నారు?" ప్రశ్నించారు శాస్త్రిగారు.

రెడ్డీ చౌదరీ ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు.

జరిగిందంతా పూసగుచ్చినట్లు చెప్పారు. కాదు... చేసిన పాపాలు చెప్పుకోవడం ద్వారా ప్రక్షాళనం చేసుకున్నారు.

మహదానంద భరితుడైనాడు విశ్వనాథశాస్త్రి.

"అంతా ఏకాంబరేశ్వరుని లీల!" అన్నారు వేదాంత మార్గంలో.

"నిజం స్వామీ!" అన్నాడు రెడ్డి.

చౌదరి "ఆనాడు మీరు ప్రాణం విలువ– మన ప్రాణం ఇతరుల గుప్పెట్లో ఉన్నప్పుడే తెలుస్తుంది అంటే తెలుసుకోలేకపోయాము. ఇతరుల బాధను మనదిగా అర్థంచేసుకొనివుంటే అనర్థాలు జరగవు అంటే అర్థంచేసుకోలేకపోయాము. మీ మాటలలోని సత్యాన్ని ఈనాడు అనుభవంలో తెలుసుకున్నాం!" అన్నాడు కృతజ్ఞతతో.

"అవును బాబూ! ఇలాంటి విపత్సమయంలో గాని మాబోంట్లకు జ్ఞానం కలగదు కాబోలు!" అన్నాడు రెడ్డి జిజ్ఞాసతో.

"ఒక్కొక్కరికి ఒక్కొక్క సమయంలో జ్ఞానోదయం కావచ్చు. దాందేముంది నాయనా... మనలో మానవత్వం ఎలా వికసించినా ఆనందించాల్సిన విషయమే కదా! అది చిగిర్చిన మర్నాడు మనకు మార్గం దొరికినట్లే! ఇవాళ నాకొక పెద్ద పండుగదినంగా ఉంది బాబూ మిమ్మల్ని చూస్తుంటే!" ఆనందాశ్రువులు రాలుస్తూ అన్నారు శాస్త్రిగారు.

చౌదరి "పంతులుగారూ... ఒక్క కోరిక! మా ఈ ద్వేషాలకు కారణం... ఎన్నికలలో పదవీ వాంఛ! రెడ్డికి అందుకు ఆస్కారం లేకుండా చేశాను. తప్పు తెలుసుకున్నాను కనుక నేను కూడా నా అభ్యర్థిత్వాన్ని ఉపసంహరించుకుంటాను. దయచేసి, నిస్వార్థపరులైన మీరు పదవిని స్వీకరిస్తే గ్రామానికి ఎన్నికల అవసరమే ఉండదు. తమరు నా మాట కాదనకూడదు" అన్నాడు వినయంగా.

రెడ్డి కూడా "అవును బాబుగారూ... నా అభిప్రాయం కూడా అంతే!" అన్నాడు.

శాస్త్రిగారు "పదవిలో ఎవరు ఉన్నారు అనేది కాదు నాయనా! ముఖ్యంగా ఆ పదవిని సక్రమంగా నిర్వహించేవారు ఎవరు ఉన్నా ఫర్వాలేదు. పశ్చాత్తాపంతో శుద్ధి అయిన నీవే ఆ పదవిని నిర్వహించవచ్చు!" అన్నారు.

"ఆ పదవిలో ఉన్నంతసేపూ నే చేసిన అత్యాచారాలు జ్ఞాపకం వస్తూ నన్ను నిత్యమూ బాధిస్తుంటాయి. ఆ చిత్రవధను నేను సహించలేను. అయినా నేను ఆ పదవిలో ఉంటే ప్రజలు కూడా నా చిత్తశుద్ధిని శంకించక మానరు... అందరి అభిమానమూ చూరగొన్న మీరు అందులో ఉంటేనే మాకు తృప్తి, నియోజక వర్గానికి మేలూ జరుగుతుంది. కనీసం ఈసారికి కాదనకండి. ఇది నాకూ, రెడ్డికీ ఉన్న కోరిక!" అన్నాడు చౌదరి ప్రాధేయ పూర్వకంగా.

శాస్త్రిగారు ఒక్కక్షణం ఆలోచించి నిట్టూర్చి, "మీ ఉభయులూ ఏది మంచిది అనుకుంటే అదే చేయండి! గ్రామానికి మీరు నన్నెలా వినియోగించుకున్నా సరే!" అన్నారు వారి కలిమి ముందు సమర్పణ భావంతో.

రెడ్డి, చౌదరిల ముఖంలో తృప్తి ద్యోతకమయింది. కృతజ్ఞతాపూర్వకంగా చేతులెత్తి దణ్ణం పెట్టారు. శాస్త్రిగారు వారిద్దరి తలా ఆప్యాయంగా నిమిరి, స్వామి దగ్గరకు తీసుకువెళ్లారు.

ముగ్గురూ స్వామికి నమస్కరించి బయటకు వచ్చారు.

మబ్బులు పూర్తిగా చెదరిపోయాయి... ఆకాశం నిర్మలంగా ఉంది... పున్నమి వెన్నెల విరగకాస్తోంది... ఆ వెన్నెట్లో ఆ ముగ్గురూ ఉరకలెత్తే మహదానందంలో గ్రామం వైపుకు చకచకా సాగివెళ్లారు.

*'జాగృతి' దీపావళి ప్రత్యేక సంచిక . . . 15 నవంబర్, 1963*